# 16. రిక్షా

"దండాలండి అమ్మగారూ"

చేస్తున్న పని ఆపి చటుక్కున తలెత్తి చూసాను. ఎదురుగా రిక్షా గంగులు చేతులు నలుపుకుంటూ కనిపించాడు. నా ముఖంలో కనిపించిన ఆశ్చర్యాన్ని గమనించికాబోలు వెంటనే అన్నాడుమళ్లీ, "అబ్బే, ఇయ్యాల ఆదివారమని గేపకవేనండి. మిమ్మల్ని తీసికెళ్లటానికి రాలేదండి. ఏరే పనిమీదా....'

వ్రాస్తున్న కలాన్ని మూసి ఏమిటి సంగతన్నట్లు చూసాను.

"రిచ్చా అమ్మేత్తానండి"

"ఎవరి రిక్షా?"

"నాదేనండి. కూసింత పైకం అవసరమయ్యిందండి."

"సరేనోయ్, మరి నాతో చెప్తావెందుకు? ఎవరైనా రిక్షా కావలిసినవాళ్ళకి చెపితే బావుంటుంది కానీ"

"అబ్బే ఈ రిచ్చా నానే తొక్కుకుంతానండి"

"మరి"

"అదికాదండమ్మగోరూ! మీరెలాగా రోజూ అంతదూరం బడికెల్లాలకదండీ! నాకు నెలకి రెండొందలు ఇత్తన్నారు కదా! ఈ రిచ్చా మీరుకొనేసుకుని, నాకారెండొందలూ ఇవ్వడం మానేత్తారండి, నానేమో మీ రిచ్చాలో మిమ్మల్ని పొద్దున్నబడికి తీసుకెల్లి మళ్లీ సాయంతరం తీసుకొచ్చేత్తానండి. ఈ మద్దిలోనూ, మీకు సెలవు రోజుల్లోనూ ఇంకేవైనా బేరాలు తొక్కుకుంతానండి. ఏదో పిల్లలు గలోణ్ణి మీరు దయసూపించాల".

ఇదేదో ఆలోచించదగిన విషయంలాగే కన్పిస్తోంది. దీన్లో దయేముంది? గంగులు చెప్పింది నిజమే. నేను రోజూ రిక్షాలో ప్రయాణం చేయడం తప్పదు.

మావారి తాతలు నేతులు తాగిన చిహ్నంగా మిగిల్చిన ఈ పెద్దదివాణం అంటే అయనకు ప్రాణం. ఈ ఇంట్లో ప్రతిమూలా, ప్రతిచెట్టూ, ప్రతిగుమ్మం, ప్రతి స్తంభం

ఆయనగారి బాల్యంలోని మధురస్మృతుల్ని గుర్తుచేసేవే. అందుకే ఉద్యోగరీత్యా ఎన్ని మైళ్ళు ప్రయాణం చేసినా, సాయంకాలానికి ఈ గూటికి చేరాల్సిందే.

"ఇంత పెద్ద ఇంట్లో..." అంటూ నేను చెప్పబోయిన అభ్యంతరాలేవీ ఆయన చెవికెక్కలేదు.

ఒకమాదిరి పట్టణాలని పిలవబడుతున్న రెండు తాలూకా కేంద్రాల మధ్య చిన్న అగ్రహారం మాది. అవతలి ఊళ్ళో ఆయన ఆఫీసు, అమ్మాయికాలేజీ, వాళ్ళిద్దరూ స్కూటరుమీద వెళ్తారు.

ఇక ఇవతలిఊళ్లో నా స్కూలు, నేను హెడ్‌మిస్ట్రెస్‌గా పనిచేస్తున్న జిల్లాపరిషత్ హైస్కూల్లోనే మా అబ్బాయి చదువుతూండడంతో రోజూ నాతోనే వాడి ప్రయాణం. ఈ రిక్షాకొనడం లాభమే తప్ప నష్టమేంలేదు. నెలకి రెండువందలు మిగులుతాయి.

కొంచెం ఆలోచించి అడిగాను. "ఎంతకి అమ్ముతావు?"

"కొత్తరిచ్చా రెండేలు అమ్ముతుందండి. నాకో ఎయ్యి రూపాయలిత్తే సాలండి".

ఫర్వాలేదు. అయిదునెలల రిక్షా అద్దె ఒక్కసారి కట్టేసాననుకుంటే ఇక ఆపై అద్దె మిగుల్తుంది. సొంతానికోరిక్షా ఉంటుంది.

సరే, రేపు టౌనుకు వెళ్ళినప్పుడు బ్యాంక్‌కు వెళదాం గుర్తుచెయ్యి అక్కడ డబ్బిస్తాను.

మర్నాడే వెయ్యిరూపాయలూ ఇచ్చేసాను గంగులుకి. మా వారితో సంప్రదిస్తే నవ్వేశారు. "కొంచెం ఇబ్బంది పడాలేమో" అని అనుమానం వెలిబుచ్చారు. "పోనీ నువ్వు స్కూటర్ రైడింగ్ నేర్చుకోరాదూ!" అని హాస్యమాడారు.

రిక్షా మనది అనేసరికి దానిలో ఇన్నాళ్లు కనిపించని లోటుపాట్లన్నీ కనిపించాయి. సీటు కొంచెం చిరిగిందనీ, టాప్ వెలిసిపోయిందనీ, వగైరా... అన్నీ మార్పించే సరికి మరో రెండువందలు ఖర్చయింది. పదిరోజుల తర్వాత టైరు పంక్చరయింది కొత్తటైరుకొని వేయించడానికి ఏభై రూపాయలయ్యింది. ఇంకోవారం తిరక్కుండా మిగిలిన రెండు టైర్లూ కొత్తవి వేయించాల్సి వచ్చింది. కొత్తటైర్లు నాలుగురోజులు తిరక్కుండా పాతవిగా ఎలా మారిపోతున్నాయో నాకర్థంకాలేదు.

రోజూ ఏదోఒక రిపేరు వచ్చిందని గంగులు నాదగ్గర పదో పరకో పుచ్చుకుంటూనే ఉన్నాడు.

ఆ రోజు స్కూలునుంచి బైటికి వచ్చే సరికి గంగులు ఒక్కడే గేటుదగ్గర ఉన్నాడు. రిక్షాలేదు.

నన్ను చూస్తూనే "అమ్మగారూ! ఇయాల్టకి మీరు ఏరే రిచ్చాలో ఎలిపోండి. మనరిచ్చా రిపేరుచేయించి అట్టుకొచ్చేత్తాను" అన్నాడు.

"ఏమైంది మళ్ళీ" విసుగ్గా అన్నాను.

"రిమ్మూ, పెడలూ ఇరిగిపోనాయండి. రెండెద్దుల బండోడొకడు మన రిచ్చాకి డేసిచ్చేసినాడు" అంటూనే పరుగెత్తుకువెళ్లి వేరే రిక్షాను పిలుచుకు వచ్చాడు.

నేను రిక్షా ఎక్కుతుంటే "జాగర్తగా తీసికెల్లరోయ్ అమ్మగార్ని" అంటూ జాగ్రత్తలు చెప్పి "మరీ.... రిపేరికి ఇరవై అవుద్దంటన్నాడండి రిపేరోడు" నసగడం మొదలు పెట్టాడు.

"మైగాడ్! - ఏంచేస్తాం, స్వయంకృతాపరాధం" అనుకుంటూ ఇరవైరూపాయలూ తీసి గంగులు చేతికిచ్చాను. అది చూస్తూ, నేను కూర్చున్న రిక్షావాడు అటుతిరిగి నవ్వుకోవడం గమనించాను. నాకు తల తిరిగినట్లయ్యింది. ఒక్కసారి కోపంతో ఒళ్లు తెలియలేదు "గంగులూ!" వెళుతున్న గంగుల్ని వెనక్కి పిలిచాను. "రేపట్నుంచీ ఆ రిక్షాకి ఏ రిపేరువచ్చినా నువ్వే ఖర్చు పెట్టుకో" అనేశాను వెళ్తున్న రిక్షాలోనించి.

మర్నాడు స్కూలుటైం అవుతున్నా గంగులు రిక్షా తేలేదు. మళ్ళీ పదిరూపాయలిచ్చి వెళ్ళాల్సి వచ్చింది. సాయంకాలం ఇంటికి తిరిగి వచ్చేసరికి రిక్షా ఇంటిముందు పందిట్లో ఉంది.

"గంగులుకి జెరం వచ్చిందంటమ్మా రిచ్చా పెట్టేసిపోయేడు" అంది నరసమ్మ నాకు కాఫీ ఇస్తూ.

రెండురోజులపాటు గంగులు కనిపించలేదు. రోజుకు పదిరూపాయలిచ్చి వేరే రిక్షాలో వెళ్తూనే ఉన్నాను. మూడవరోజు గంగులు ఇంకో రిక్షాతొక్కుతూ కన్పించాడు. నేను ఆశ్చర్యపోయాను.

ఇంకెవరినైనా మాట్లాడాలనుకున్నాను నేను వెళుతున్న రిక్షావాడినడిగాను.

"అలా కుదరదండి, ఆడు... ఆ గంగులుగాడు నేనింక ఆ బండి తొక్కనని అందరికీ సెప్తేకానీ, మాలో ఇంకెవరూ ఆ బండి ముట్టుకోరండి"

"ఆ రిక్షా మాదే, మేంకొన్నాంతెలుసా"

"ఆ తెలుసండి, రిచ్చా మీదైతే ఏటి నాబవండి తొక్కేవోడు ఆడేగదండి. తొక్కేవోడు లేకుండా రిచ్చా మీకేటుపయోగవండి?'

వీడేదో న్యాయసూత్రం చెపుతున్నట్టున్నాడు, లేనిపోని తలనొప్పి కొని తెచ్చుకున్నట్లయింది. ఇంటిముందు రిక్షాను అలా చూస్తూంటే నాకేవిటోగా, నా తెలివి తక్కువతనాన్ని ఎవరో వేలెత్తి చూపిస్తున్నట్లుగా ఉంది.

ఇదంతా వింటూ భోజనాల దగ్గర పిల్లలూ, ఆయనా ఒకటే నవ్వులు. నాకు చాలా ఉడుకుమోత్తనంగా ఉంది.

మర్నాడే గంగులుకోసం కబురు చేసాను. వస్తూనే భుజంమీద తువ్వాలు తీసి వాకిట్లోని రిక్షాఅంతా శుభ్రంగా తుడవడం మొదలుపెట్టాడు.

"సరేకానీ గంగులూ! రిపేరుఛార్చి నేను పెట్టుకుంటాలే. రిక్షామళ్ళీ నువ్వే తొక్కు" అన్నాను మనసులోమాత్రం ఓడిపోయిన ఫీలింగ్ కదులుతుండగా.

తిరిగి గంగులు మారిక్షా తొక్కుతూనే ఉన్నాడు. పది రోజులకొక టైరు బర్స్ట్ అవుతూనే ఉంది. నెలలో నాలుగైదు రోజులు నేను వేరే రిక్షాల్లో వెళ్లాల్సివస్తూనే ఉంది.

మూడునెలల తర్వాత :

ఆ రోజూ మళ్ళీ ఆదివారం. ప్రొద్దుటే వీధి చావట్లో కూర్చుని స్కూల్ రికార్డ్సు సరిచూస్తున్నాను.

"దండాలండి అమ్మగారు" గంగులు.

ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా చూసాను "మన రిచ్చాసీటు ఎవరో ఎత్తుకెలిపోనారండి. వంద రూపాయలౌద్దండి ఏపిచ్చటానికి మరేవోనండి..."

ఆగమని చేత్తోసైగచేసి ఇలా అన్నాను "గంగులూ! ఆరిక్షా అమ్మేయాలనుకొంటున్నాం. నువ్వు కొనుక్కుంటావా? ఇంకెవరికైనా చెబుతావా?"

ఓ నిమిషం ఆలోచించాడు గంగులు.

'ఎవరో ఎందుకండి, నారిచ్చానానే కొనుక్కుంతాను. ఎంతకిత్తారేటండి?"

"కొత్తేముంది? నీ దగ్గరకొన్నట్టే. ఈ మధ్యలో నేను ఖర్చుపెట్టిందంతా నీకు నెలనెలా కట్టే అద్దె అనుకుంటాలే.

చాలా తేలిగ్గా నవ్వేసాడు గంగులు. "అదెయ్యి రూపాయలకెంతుకండీ! సీటు కూడా పోయిందండి, బండిబాగా పాతబడిపోనాదండి. రెండొందలకైతే నాకేవీ అభ్యంతరం నేదండి, రేపే డబ్బులైచ్చి బండట్టుకెల్లిపోతానండి. ఏతంతారు అమ్మగారు?"- గంగులు చేతులు జోడించి మరీ చెప్తున్నాడు.

నేనేమంటాను! అసలు నాకు గొంతులోంచి మాటవస్తేకదా!

*(జూన్ 1985 జ్యోతి మంత్లీ)*